

నేడు మడ్డువలస నీరు విడుదల

వంగర/ రాజాం, జూలై 13: మడ్డువలస రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా ఆదివారం ఉదయం 10 గంటలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ఏఈ నితిన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ నీరు విడుదల చేస్తారని తెలిపారు. ఆయకట్టు పరిధిలోని ఆరు మండలాల్లో 30,700 ఎకరాలకు నీరు అందించటానికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలువ ద్వారా ముందుగా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేసి, క్రమంగా సామర్థ్యం పెంచుతామని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే కూడా ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆ నిధులు ఏమయ్యాయి?

- ఆంధ్ర జలాశయం ఆధునికీకరణకు రూ.16 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- పనులు చేపట్టడంలో గత సర్కారు నిర్లక్ష్యం
- ఇప్పటికీ పూర్తికాని వైనం
- నిధుల ఖర్చుపై అనుమానాలు
- సమగ్ర విచారణ చేపట్టాలని రైతుల డిమాండ్



గేట్ల వద్ద లీకులు

(మెంటాడ)

మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాలకు ప్రధాన సాగునీటి వనరు ఆంధ్ర జలాశయం. మూడు మండలాల పరిధిలోని 22 గ్రామాలకు ఇదే దిక్కు. 6.1 కిలోమీటర్ల పొడవునున్న ఎడమ కాలువ కింద 4,630 ఎకరాలు, 3.6 కిలోమీటర్ల పొడవునున్న కుడి కాలువ కింద 4,796 ఎకరాలు మొత్తం 9,426 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం 7వేల ఎకరాలకే సాగునీరు అందే పరిస్థితి నెలకొంది. జలాశయం ఆధునికీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం 2020లో రూ.16 కోట్ల జైకా నిధులు మంజూరు చేసింది. రెండేళ్లలో పనులు పూర్తిచేస్తామని గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. అయితే, ఏడాది పాటు ఆ ఊసే ఎత్తకుండా 2021లో పనులు ప్రారంభించారు. పూడుకుపోయిన కాలువల అభివృద్ధికే పనులను పరిమితం చేశారు. ఆ ఏడాది జూలైలో నాటి ఎమ్మెల్యే రాజన్నదొర చేతులమీదుగా ఖరీఫ్ సీజన్‌కు నీరు విడుదల చేసి మమ అనిపించేశారు. మిగిలిన పనులను గాలికొదిలేశారు. ముఖ్యంగా కుడి, ఎడమ అనుబంధ కాలువలను బాగు చేయలేదు. 9 ఆర్ కాలువ, హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభించలేదు. రెగ్యులేటర్ వద్ద గేట్ల ద్వారా నీరు లీకై చంపావతి నదిలోకి నీరు వృథాగా పోతుంది. పనుల్లో నాణ్యత లేదని, నాశిరకం గేట్లు అమర్చి రంగులు వేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. లోతుగెడ్డ వద్ద ఉన్న బట్టి కాలువ అధ్వానంగా ఉండడంతో బొండపల్లి, గజపతినగరం మండలంలోని ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. రైతులే కొంత సొమ్మును పోగుచేసి ఎక్స్‌కవేటర్‌తో కాలువ పనులు చేపట్టారు. స్వయంగా పైపులు అమర్చుకొని నీటిని పొలాలకు మళ్లిస్తున్నారు. రిజర్వాయర్ ప్రాంతంలో విద్యుత్తు సౌకర్యం కూడా అంతంతమాత్రమే. 2021 తర్వాత రెండేళ్ల పాటు వేసవిలో ఆధునికీకరణ పనులు చేస్తామనడంతో రైతులు రబీ సాగును వదులుకున్నారు. అయిన నేటికీ పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. దీనివల్ల వారు తీవ్రంగా నష్టపోయారు. రూ.16 కోట్లతో రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు జరిపించామని అధికారులు చెబుతున్నా మచ్చుక కూడా ఆ ఆనవాళ్లు కనిపించడం లేదు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని రైతులు చెబుతున్నారు.



సాగునీటి కాలువ ఇలా..

సుందరీకరణా.. అదెక్కడ?

ఆంధ్ర జలాశయం ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడేది. ప్రధానంగా కార్తీక మాసంలో ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు పర్యాటకులు వచ్చేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతం కళావిహీనంగా మారడంతో పర్యాటకులు రావడం లేదు. రూ.16 కోట్ల నిధుల్లో కొంత మొత్తాన్ని రిజర్వాయర్ సుందరీకరణ కోసం కేటాయించారు. మట్టికట్టపై ఆకర్షణీయమైన గడ్డి, పూల మొక్కలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. కానీ, పనులు మాత్రం చేపట్టలేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. జలాశయం నిర్మాణ సమయంలో వేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి మట్టికట్టకు ముప్పు ఏర్పడు తోంది. వరద నీరును వెలుపలకు పంపేందుకు ఏర్పాటు చేసిన పైపులు అస్తవ్యస్తంగా ఊడిపడి ఉన్నాయి. రాతికట్టపై పొడుగాటి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీనివల్ల ఆనకట్టకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. రిజర్వాయర్ ప్రాంతంలో ప్రమాదాలతో పాటు మరణాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు, మరణాలకు గల కారణాలు తెలుసుకునే అవకాశముంది. అయినా ఇరిగేషన్ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. కాగా, రిజర్వాయర్ రెగ్యులేటరి ఆఫీసులో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. గజపతినగరం కార్యాలయంలో ఉంటూ ఇక్కడి పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఉంటారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లస్కర్లతోపాటు ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఇక్కడ కానరారు. గజపతినగరం కార్యాలయానికి వెళ్తే ఫీల్డ్‌కు వెళ్లారని అక్కడ సిబ్బంది చెబుతుంటారు.

అంతా ఆయనే?

ఈ రిజర్వాయర్ పనులు మొత్తం ఇక ఇంజనీరింగ్ అధికారి కనుసన్నల్లోనే జరిగినట్టు తెలుస్తోంది. మొన్నటి వరకు రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పిన జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేతకు సదరు ఇంజనీరింగ్ అధికారి స్వయాన తమ్ముడు. అందువల్ల ఆయనకు ఎవరూ అడ్డుచెప్పలేకపో యారనే విమర్శలు ఉన్నాయి. మొత్తమ్మీద, ఆంధ్ర రిజర్వాయర్ జైకా నిధులను ఒకరిద్దరు అధికారులు, కొందరు సిబ్బంది ఏటీఎంలా వాడుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పనులు పూర్తికాకుండానే రూ.16కోట్లు ఖర్చయిపోయినట్టు చెబుతుండడంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

ఎవరి మాట నిజం

ఆంధ్ర రిజర్వాయర్ పనులను 2023లో జైకా ప్రిన్సిపల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ అనురాగ్ సిన్హా పరిశీలించారు. రూ.16 కోట్ల నిధులకు రూ.13 కోట్ల విలువైన పనులు జరిగాయని ఆయన చెప్పారు. కానీ, వాటి వివరాలను వివరించలేదు. మిగిలిన నిధులతో అసంపూర్తి పనులు, సుందరీకరణ చేస్తామని చెప్పారు. కుడి, ఎడమ అనుబంధ కాలువలు శిథిలమయ్యాయని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా పనులు చేపట్టలేదు. ఈ రిజర్వాయర్ పనులపై గజపతినగరం డివిజన్ ఇరిగేషన్ డీఈ పాండు మాట్లాడుతూ.. 2022 నాటికే రూ.16 కోట్ల నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు జరిగాయని, పనులు నూరుశాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. పెండింగులో ఏమీ లేవన్నారు. అయితే, 2023 నాటికి రూ.13కోట్ల పనులే జరిగినట్లు జైకా కార్యదర్శి అనురాగ్ సిన్హా ప్రకటించారు. ఈ ఇద్దరిలో ఎవరి మాట నిజమో తెలియడం లేదు. పనులు అసంపూర్తిగా ఉండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు పంటలు కోల్పోయాం

నేను రెండెకరాల రైతును. సాగునీటికి నాలు గేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. కాలువలు సరిగా లేక రెండు రబీ సీజన్లను నష్టపోయాం. అధికారులను కలిసి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. రిజర్వాయర్ కోసం రూ.కోట్లు విడుదల అయ్యాయని విన్నాం. ఆ డబ్బు ఎక్కడికి పోయిందో. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. శ్రమదానంతో కాలువలను బాగు చేసుకుంటున్నాం.

- లగుడు సత్యనారాయణ, రైతు, లోతుగెడ్డ గ్రామం

పనులు ఆనవాళ్లే లేవు


రూ.16 కోట్లతో రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు జరిపించామని అధికారులు అంటున్నారు. కానీ, ఆ ఆనవా ళ్లు ఎక్కడా కనిపించడం లేదు. సమస్యలు ఎక్కడివక్కడే దర్శనం ఇస్తున్నాయి. రైతుల ఇబ్బందులు తీరలేదు. జలాశయానికి అతీగతి లేకుండా పోయింది. వచ్చిన నిధులు ఎటు వెళ్తున్నాయో తెలియడం లేదు. సుందరీకరణ ఊసేలేదు. రెగ్యులేటర్ వద్ద గేట్ల ద్వారా నీరు లీకులు అవుతున్నాయి. చంపావతి నదిలోకి నీరు వృథాగా పోతుంది. దీనిపై విచారణ జరగాలి.

- సూరెడ్డి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్, లోతుగెడ్డ

చర్యలు తీసుకోవాలి

ఆంధ్ర రిజర్వాయర్ పనుల్లో ఎన్నో అక్రమాలు జరిగాయి. నిధుల గోల్‌మాల్ జరిగింది. పనులు పేరు చెప్పి రూ.కోట్లు కొల్లగొట్టేశారు. 9ఆర్ కాలువ, హైలెవల్ కెనాల్ పనులు ప్రారంభించలేదు. రెగ్యులేటర్ వద్ద నాశిరకం గేట్లు అమర్చారు. రంగులద్ది మస్తాబు చేశారు. పనుల్లో నాణ్యత లేదు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

- రాకోటి రాములు, సీపీఎం మండల శాఖ నేత



గడ్డి, పిచ్చిమొక్కలతో నిండిపోయిన జలాశయం

జిల్లా ఎస్పీగా వకుల్ జిందాల్

- దీపిక అనకాపల్లికి బదిలీ



కొత్త ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 13: జిల్లా నూతన ఎస్పీగా వకుల్ జిందాల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ప్రస్తుత ఎస్పీ ఎం.దీపిక అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. 2021 జూలై 12న జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి దీపిక మూడేళ్ల పాటు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తనదైన శైలిలో విధులు నిర్వహించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా చూశారు. సౌమ్యురాలుగా జిల్లా ప్రజల నుంచి మన్ననలు పొందారు. కాగా, ఐదో బెటాలియన్ చింతలవలస కమాండెంట్‌గా మల్లికా గార్గ్ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం పల్నాడు జిల్లాలో ఎస్పీగా విధులు నిర్వహిస్తూ కమాండెంట్‌గా బదిలీపై వస్తున్నారు.



బదిలీ అయిన ఎస్పీ దీపిక

ఉమ్మడి జిల్లా గురుకులాల కో ఆర్డినేటర్ బదిలీ

- ఇన్‌చార్జిగా ఫ్లోరెన్స్ నియామకం

సాలూరు రూరల్/వేపాడ, జూలై 13: బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ టి.పద్మజ బదిలీపై చిత్తూరు వెళ్లారు. ఆమె స్థానంలో వేపాడ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

పార్ట్‌టైం గెస్ట్ టీచర్ల భర్తీకి 18న ఇంటర్వ్యూలు

ఉమ్మడి జిల్లాలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పార్ట్‌టైం గెస్ట్ టీచర్ల భర్తీ కోసం ఈ నెల 18న నెల్లిమర్ల గురుకులంలో ఇంటర్వ్యూలు, డెమో నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ ఫ్లోరెన్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఉదయం పది గంటలకు నేరుగా రావొచ్చన్నారు. కొప్పెర్లలో ఇంగ్లిష్, గణితం, తెలుగు లెక్చరర్ ఖాళీలు, హిందీ టీజీటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పాలకొండలో ఎకనామిక్స్, బొడ్డవలసలో ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి కేవలం పురుష అభ్యర్థులే అర్హులన్నారు. వేపాడలో ఫిజిక్స్ లెక్చరర్, రెండు పోస్టులు గణితం, సోషల్ ఒక పోస్టు పీజీటీ, ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ టీజీటీలు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వియ్యంపేటలో గణితం లెక్చరర్, పీజీటీ గణితం, వంగరలో గణితం, జువాలజీ లెక్చరర్ పోస్టులు, నెల్లిమర్లలో టీజీటీ హిందీ, భామినిలో ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ టీజీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు కేవలం బీఎడ్, పీజీ, టెట్ పూర్తయిన మహిళా అభ్యర్థులు మాత్రమే హాజరవ్వాలన్నారు. పీడీ పోస్టుకు బీపీఎడ్‌తో పాటు పీజీ లేదా ఎంపీఎడ్ అర్హత, ఆరోగ్య సూపర్‌వైజర్‌పోస్టుకు జీఎన్ఎం అర్హత కలిగి ఉండాలని వెల్లడించారు. ఇతర వివరాలకు విజయనగరంలో కో ఆర్డినేటర్ కార్యాలయం లేదా సంబంధిత గురుకులాల్లో సంప్రదించాలని సూచించారు.

రామా.. కనవేమిరా!

- గుళ్ల సీతారామపురం ఆలయ భూములు అన్యాక్రాంతం
- ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ దేవాలయ భూములు కూడా..
- బోర్డులు పీకేసి కబ్జా చేస్తున్న వైనం
- పరిరక్షణకు కానరాని చర్యలు
- పట్టించుకోని అధికారులు

దేవుళ్ల మాన్యానికి రక్షణ కరువైంది. వందల ఎకరాలు అన్యాక్రాంతమవుతున్నాయి. అధి కారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సైతం తొలగించి కబ్జా చేసేస్తున్నారు. సంతకవిటి మండలం గుళ్లసీతారామపురంలోని సీతారామస్వామి ఆలయ భూములతో పాటు రాజాం మునిసిపాలిటీ పరిధి డోలపేటలోని ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ స్వామి ఆలయ భూములు సైతం ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్నాయి. కోట్లా రూపాయల విలువ చేసే భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఆక్రమణదారులు మరింతగా బరి తెగిస్తున్నారు.

(రాజాం రూరల్)

సంతకవిటి మండలం గుళ్ల సీతారామపురంలో 16వ శతాబ్దంలో బొబ్బిలి రాజులు సీతారామస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి 502.67 ఎకరాల భూములు ఉన్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో చాలావరకు భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీంతో స్వామివారి ధూపదీప నైవేద్యానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వంగర మండలంలో స్వామి వారికి ఉన్న 143.71 ఎకరాలను మడ్డువలస ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం తీసుకుంది. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన పరిహారంలో 60శాతం రైతులకు, 40 శాతం ఆలయానికి పంచారు. రూ.16 లక్షల పరిహారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఆ మొత్తంపై వచ్చిన వడ్డీతో సీతారామస్వామి ఆలయ నిర్వహణ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 358.96 ఎకరాల భూమిలో... రాజాంలో 8.04 ఎకరాలు, రాజాం మున్సిపాలిటీ సారధిలో 12.62 ఎకరాలు, రేగిడి మండలం ఖండ్యాంలో 28.49, సంతకవిటి మండలం బొద్దూరులో 28.07, గుళ్లసీతారాంపురంలో 6.83, మాధవరాయపురంలో 21.40, వాసుదేవపట్నంలో 3.42, బూర్జ మండలం చినలంకాలంలో 39.19, పాలకొండ మండలం పద్మాపురంలో 2.65, వాటపాగులో 57.72, గార మండలం శ్రీకూర్మంలో 150.53 ఎకరాలు, సంతకవిటి మండలం శంకరుణి అగ్రహారంలో 0.26 సెంట్లను బొబ్బిలి రాజులు ఆలయానికి ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. ఇందులో ప్రస్తుతం గుళ్ల సీతారాంపురంలోని 9.1, 5.1 సర్వే నెంబర్లలో 6.83 ఎకరాలు మాత్రమే ఆలయం పేరిట ఉన్నాయి. బొద్దూరులోని 28.07 ఎకరాలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఆలయం పేరు లేదు. మరికొన్ని భూములకు సంబంధించి రైతులు, దేవదాయశాఖ మధ్య కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. వాసుదేవపట్నంలోని సర్వే నెంబర్లు 166, 390లో 3.42 ఎకరాలు తొమ్మిది సబ్ డివిజన్లలో 12 మంది రైతుల పేరున ఉంది. శంకరుణి అగ్రహారంలోని సర్వే నెంబర్ 53.4లో 0.26 సెంట్లు భూమి ఒక రైతు పేరున ఉంది. బూర్జ మండలం చినలంకాంలోని సర్వే నెంబర్లు 59, 60, 62, 104, 111, 113లో ఉన్న 39.19 ఎకరాల భూమి నుంచి మాత్రమే ఆలయానికి రైతుల నుంచి ఆదాయం సమకూరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఆ ఆలయాల భూములు కూడా..

రాజాం మునిసిపాలిటీ పరిధి డోలపేటలోని ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణస్వామి ఆలయ భూములు సైతం ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్నాయి. ఈ ఆలయానికి చెందిన 20 ఎకరాల భూమిని దేవదాయశాఖ నుంచి ఆర్టీసీ.. డిపో నిర్మాణం కోసం గతంలో సేకరించింది. అయితే డిపో నిర్మాణం చేపట్టకపోవడంతో దేవదాయశాఖ తిరిగి ఆ భూమిని స్వాధీనం చేసుకుంది. హీనపక్షంగా రూ.150 కోట్లకు పైగా విలువ చేసే ఈ భూమిని పరిరక్షించే చర్యలు శూన్యమనే చెప్పాలి. ఈ భూమిని ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణదారుల గుప్పెట ఉంది. కేర్ హాస్పిటల్ సమీపంలో సర్వే నెంబర్ 94లో కోట్ల విలువ చేసే స్థలం సైతం ఆక్రమణలో ఉంది. ఈ భూములు తమవేనంటూ కొందరు ఈ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు సైతం నిర్మించారు. ఇదే ఆలయానికి చెందిన చెరువుపై రెవెన్యూశాఖ ఇళ్లపట్టాలు ఇవ్వడం చర్చనీయాంశం అయ్యింది. చెరువు గట్టుపై నిర్మాణాలు వెలిశాయి. రాజాం పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయాన్ని ఆనుకుని సర్వే నెంబర్ 112లోని 1.2 పార్ట్‌లో ఉన్న సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 1.20 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైంది. ఈ స్థలంలో కొంత భాగాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ప్లాట్లుగా విభజించి అమ్మేశాడు. రిజిస్ట్రేషన్ సమయంలో దేవదాయ భూములని తేలడంతో తీసుకున్న అడ్వాన్స్ తిరిగి చెల్లించాల్సి వచ్చింది. వెంకటేశ్వర దేవాలయం వద్ద ఉన్న భూముల్లో గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ప్రస్తుతం కనిపించడం లేదు. తిరిగి ఏర్పాటు చేయడంలో శాఖాధికారులు దృష్టి పెట్టలేదు. డోలపేట చెక్‌పోస్ట్ సమీపంలో దేవదాయశాఖకు చెందిన భూముల్లో ఏళ్లుగా తాత్కాలిక షెడ్లు వేసి కొంతమంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరికొంత మంది అద్దెలకిచ్చి నాలుగురాళ్లు వెనుకేసుకుంటున్నారు. ఏళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడలేదు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ (శ్రీకాకుళం) గతేడాది ఈ భూములను పరిశీలించినా చర్యలకు మాత్రం ఉపక్రమించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వామివార్ల భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇస్తున్నాం

దేవదాయశాఖ భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. రాజాం పట్టణంలో ఇప్పటికే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నాం. కేసులు కూడా నమోదు చేస్తున్నాం. కొన్నిచోట్ల రైతులు, ఆక్రమణదారులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. అయినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. డోలపేట చెక్‌పోస్ట్ వద్ద ఉన్న షాపుల యజమానులకు నోటీసులు ఇచ్చాం. త్వరలో అద్దె నిర్ణయిస్తాం.

- బలివాడ మాధవరావు, ఈవో, సీతారామపురం దేవస్థానం



వెంకటేశ్వర దేవాలయం సమీపంలో దేవదాయశాఖ భూమి

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

- రూ.12 లక్షలు వసూలు చేసిన యువకులు
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


బొబ్బిలి, జూలై 13: ఇంజనీరింగ్ కోర్సులో ఫెయిలైన విద్యార్థిని పాస్ చేయించడమే కాక, మంచి ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని కొందరు యువకులు నమ్మించి మోసం చేశారు. ఆ విద్యార్థి నుంచి రూ.12లక్షలు వసూలు చేసి కుచ్చుటోపీ పెట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుజూసింది. బొబ్బిలి పట్టణంలోని వెలమవారివీధికి చెందిన ఎల్ఐసీ ఏజెంటు కుమారుడు రాజాంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. ఆ విద్యార్థి పలు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీనిని ఆసరాగా చేసుకుని శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొంతమంది యువకులు ఆ విద్యార్థికి మాయమాటలు చెప్పి ఇంజనీరింగ్‌లో పాస్ చేయించి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఇందుకోసం దపదఫాలుగా అతడి నుంచి రూ.12 లక్షలు వసూలు చేశారు. ఈ ఏడాది మేలో ఈ తతాంగాన్ని పూర్తి చేశారు. ఈ నెల 9న పరీక్ష ఫలితాలు వచ్చాయి. అందులో ఆ విద్యార్థి మళ్లీ ఫెయిలయ్యాడు. డబ్బులు దండుకున్న వ్యక్తులను ఫోన్‌లో గట్టిగా నిలదీశాడు. కళాశాలకు వచ్చి పాస్ సర్టిఫికెట్ తీసుకెళ్లాలని వారు చెప్పారు. దీంతో కళాశాలకు వెళ్లి ఆరా తీయగా ఇదంతా మోసమని తేలడంతో లబోదిబోమన్నాడు. ఈ నెల 11న పోలీసులను ఆశ్రయించారు. ఏయే బ్యాంకుల్లో, ఎవరెవరి పేరుతో డబ్బు జమ చేసింది, తదితర విషయాలన్నిటినీ ఆధారాలతో సహా విద్యార్థి తండ్రి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోనికి దిగారు. గతంలో ఆ కళాశాలలో చదువుకున్న విద్యార్థులే ఈ దురాగతానికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఈ విషయమై సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు వివరణ కోరగా.. 'బీటెక్ ఉత్తీర్ణతకు సంబంధించి కొంతమంది యువకులు ఈ తరహా మోసానికి పాల్పడినట్లు బాధితుని నుంచి ఫిర్యాదు అందింది. కేసు ఛేదించి అన్ని వివరాలు తెలియజేస్తామని' తెలిపారు.







అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.


మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా


నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్ల తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు.




లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్య, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)







పదేళ్లు అధికారమిస్తే హైదరాబాద్ స్థాయికి అమరావతి

● ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

జామి: మరో పదేళ్ల పాటు కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉంటే మన అమరావతి.. హైదరాబాద్ స్థాయికి చేరుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం లొట్లపల్లి గ్రామంలోని ఎస్‌సీ కాలనీలో టీడీపీ నాయకుడు కాకర్లపాటి శ్రీనురాజు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి, పాల అభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యువత తాము ఉన్న చోటే ఉద్యోగాలు కావాలని కోరుకుంటున్నారని, అది చాలా తప్పు అన్నారు. ఏదో ఒక రంగంలో శిక్షణ పొందితే అందులో రాణించి ఆర్థిక ప్రగతి సాధించవచ్చున్నారు. యువత శిక్షణ పొందిన రంగంలో ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలో పరిశ్రమల ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం చంద్రబాబునాయుడే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలరని గట్టిగా నమ్మి కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ ఐదేళ్లలో లొట్లపల్లి గ్రామం నుంచి యువతను అధిక సంఖ్యలో ఉద్యోగులుగా చూడాలనే తన కోరికను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పి.స్వామినాయుడు, లగుడు రవికుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, మండల పార్టీ కార్యదర్శి వర్రి రమణ, మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, జనసేన నేతలు సురేష్, రవికుమార్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, టీడీపీ మహిళా విభాగం నేతలు మాకిరెడ్డి శ్రీలక్ష్మి, సూరెడ్డి ఝాన్సీలక్ష్మి, కొత్తలి సూర్యారావు, పైడిరాజు, చందక ఎర్నాయుడు, గోపి, జనసేన మండల అధ్యక్షుడు పీవీఆర్ వర్మరాజు, నాయకులు జన్నెల బాలకృష్ణ, ముగడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

గజపతినగరం: నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అధికారులు పని చేయాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి జాడలేక నియోజకవర్గం ఎంతో వెనుకబడిపోయిందన్నారు. అధికారులు అభివృద్ధి పనులపై ప్రణాళికలను సిద్ధం చేసి అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వం తట్ట మట్టి కూడా వేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారని అన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు హయాంలో పోలవరం పనులు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

చేసి చివరి ఎకరాకు సాగు నీరు అందించే దిశగా పనులు చేపడతామని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వంతో పాటు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్, దత్తిరాజేరు మండల పార్టీ నాయకులు చప్పా చంద్రశేఖర్, నాయకులు శీరం రెడ్డిరామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 15 మేక పిల్లలు మృతి



మృతిచెందిన మేక పిల్లలు

రాజాం, జూలై 13: వీధి కుక్కల దాడిలో మేకపిల్లలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పురపాలక సంఘం పరిధిలోని మల్లయ్యపేట కాలనీకి చెందిన కోడిబోయిన నగేష్ తన మేకపిల్లలను గ్రామంలో ఒక చోట పెట్టి ఉంచాడు. శనివారం వేకువజామున వీధి కుక్కలు దాడి చేయడంతో 15 మేకపిల్లలు మృత్యువాత పడ్డాయి. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని నగేష్ కోరాడు. పురపాలక సంఘం అధికారులు చర్యలు తీసుకుని కుక్కలను కట్టడి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

చీపురుపల్లి, జూలై 13: చీపురుపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి టి.రమేష్ అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు, రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం, మండలంలోని అలజంగి గ్రామానికి చెందిన రమేష్ కుటుంబం కొంత కాలం కిందట, పట్టణంలోని మెట్ట కాలనీకి వచ్చి స్థిరపడింది. ఓ ప్రైవేటు బ్యాంకులో పని చేస్తున్న రమేష్‌కు గతేడాది పెళ్లయ్యింది. ఈ క్రమంలో శనివారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు కింద రమేష్ పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే ప్రమాదవశాత్తూ రైలు కింద పడిపోయాడా, లేదా ఆత్మహత్యకు ప్రయత్నించాడా అనేది తేలాల్సి ఉంది. మెరుగైన చికిత్స కోసం రమేష్ ను విజయనగరం తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి..

చీపురుపల్లి, జూలై 13: పట్టణంలోని మెయిన్ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండా రాకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. మెయిన్ రోడ్డులో మోటారు సైకిల్‌పై వెళ్తున్న రాకేష్ బజాజ్ షో రూం సమీపంలో కుక్కను ఢీకొని కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాకేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన చికిత్స కోసం రాకేష్‌ను విజయనగరం తరలించారు. ఎస్సై కె. కిరణ్‌కుమార్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లిమర్లలో కారుపై దాడి

నెల్లిమర్ల, జూలై 13: నెల్లిమర్లలో ఓ కారుపై రాయితో దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన సూర్యారావు కుటుంబంతో కలిసి కారులో చీపురుపల్లి మండలం లోని తమ బంధువుల ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో వెళ్తున్నాడు. ఈ సమయంలో నెల్లిమర్లలోని ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్‌లోకి వచ్చేసరికి ఓ వ్యక్తి అడ్డగించి 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, అందుకు తాము వ్యతిరేకించడంతో కారుపై రాయితో దాడికి పాల్పడ్డాడని దీంతో కారు అద్దాలు పగిలిపోయాయని బాధితుడు తెలిపారు. అయితే వెంటనే అతని నుంచి తప్పించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయామని వాపోయడు. దీనిపై శనివారం ఉదయం నెల్లిమర్ల పోలీసుల దృష్టికి తీసుకురావడంతో పోలీసులు విచారణ జరిపి స్థానిక రెల్లివీధికి చెందిన పైడిరాజు అనే మతిస్థిమితం లేని వ్యక్తి ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా సూర్యారావు బంధువు, గుర్లకు చెందిన ఎం.ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి శనివారం రాత్రి నెల్లిమర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ బంధువులు కారులో వెళ్తుండగా ఒక వ్యక్తి కారును ఆపి, రూ.20వేలు డిమాండ్ చేయడంతో పాటు సూర్యారావు జేబులో నుంచి వెయ్యి రూపాయాలు లాక్కొని పారిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. నెల్లిమర్ల ఎస్ఐ ఎస్.రామ్‌గణేష్ కేసు నమోదు చేశారు.

అర్హులకు పథకాలు అందించండి



డీఆర్వోకి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

విజయనగరం దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకం కింద రిజిస్టర్ చేసుకున్న అర్హులైన వారికి వెంటనే సాయం అందించాలని బీజేపీ విశ్వకర్మ యోజన కన్వీనర్ కుప్పిలి మోహనా చారి, నాయకులు ఇమంది సుధీర్‌లు కోరారు. శనివారం డీఆర్‌ఓ అనితను కలిసి వినతి పత్రం అందించారు. డీఆర్‌వోను కలిసిన వారిలో బీజేపీ నాయకులు సురేష్, పైడిరాజు, దేవుడు, సోము మహేష్, రాజకుమార్ హీరావత్, గిరిష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇంకా 'రైతు భరోసా కేంద్రాలే'



పేరుమార్చని, మాజీ ముఖ్యమంత్రి బొమ్మ తీయని అలమండ రైతుభరోసా కేంద్రం

జామి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా కేంద్రాలను 'రైతు సేవ కేంద్రాలు'గా మార్చామని చెబుతున్నారు. కానీ వీటిపై ఇంకా రైతుభరోసా కేంద్రాలుగానే పేర్లు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్ బొమ్మలనే ఇంకా కొనసాగించడం గమనార్హం. దీనిపై మండలంలోని అలమండ టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఆర్బీకే ఉద్యోగులను అడిగితే తమకు ఇంకా తొలగించాలని ఎటువంటి ఉత్తర్వులు రాలేదని చెప్పారన్నారు. ఈ విషయంపై ఏవో కిరణ్‌కుమార్ ను వివరణ కోరగా రైతు భరోసా కేంద్రాలను రైతు సేవ కేంద్రాలుగా పిలుస్తున్నారని.. ఈపేర్లు మార్చాలని ఇంకా అధికారికంగా ఉత్తర్వులు వెలువడలేదని చెప్పారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

తెర్లాం: మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక సర్పంచ్‌లు, అధికారులు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ రాకుండా కాలువల్లో పూడికలు తీసి, బ్లీచింగ్ చల్లారు. అటు సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌లు, మంచినీటి బావులలో క్లోరినేషన్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బాడంగి, జూలై 13: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి అన్నారు. శనివారం మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో గ్రామంలో అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధులపై గ్రామ స్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను రోడ్లపై పారవేయకుండా చెత్తడబ్బాల్లో వేయాలన్నారు. మురుగునీరు కాలువల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అలాగే కాలువల్లో పూడికతీతలు, తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ వంటి చర్యలు అధికారులు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

జడ్పీ తీర్మానం అభినందనీయం

విజయనగరం దాసన్నపేట: విశాఖపట్టణం రహదారి జొన్నాడ గ్రామం వద్ద నిర్మించిన టోల్‌గేట్‌ను వేరే చోటుకు తరలించాలని కోరుతూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించడం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ నాయకులు అల్లం నాగభూషణం అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తక్షణమే టోల్‌గేట్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాజారావు, పీఎల్ఎన్ రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను ఉపయోగించుకోండి

లక్కవరపుకోట: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలని మండల పశువైద్యాధికారి కే.గాయత్రి కోరారు. శనివారం ఖాసాపేట గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు, చాఫ్ కట్టర్లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అదే విధంగా పశువుల్లో వచ్చు సీజనల్ వ్యాధులపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సహాయకులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

విజయనగరం రూరల్: జిల్లా స్థాయి టైక్వాండో పోటీలు ఆదివారం ఉదయం 10 గంటలకు తోటపాలెం గాయిత్రీ స్కూల్ ఆవరణలో జరుగుతాయని జిల్లా టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభిస్తారని తెలిపారు.

మినీ గోకులాల బిల్లులు చెల్లించండి



డిమాండ్ చేస్తున్న రైతులు

వేపాడ: టీడీపీ ప్రభుత్వం 2014-2019 మధ్య కాలంలో మినీ గోకులాల షెడ్లు మంజూరు చేసింది. వీటిని నిర్మించిన తరువాత వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందని.. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అప్పటి పశువైద్యాధికారులు చెప్పిన కొలతల మేరకు షెడ్లు నిర్మించుకున్న సంగతి తెలిసిందే. సకాలంలో నిర్మాణాలను పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని చెప్పిన అధికారులు మాట నిలుపుకోలేదని అంటున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పాలకులు మినీ గోకులాల షెడ్లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం కొండగంగుబూడి పంచాయితీ పరిధిలోని రైతులు ఏపీ రైతు సంఘం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. బిల్లులను తక్షణమే చెల్లించి తమను ఆదుకోవాలని.. లేదంటే ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు.

అశ్రునయనాలతో సైనికునికి అంతిమ వీడ్కోలు

● సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



నివాళి అర్పిస్తున్న బేబీనాయన

బాడంగి/బొబ్బిలి: లడఖ్‌లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో గురువారం అశువులుబాసిన సైనికుడు గొట్టాపు శంకరరావు భౌతిక కాయాన్ని ప్రత్యేక విమానంలో శనివారం గ్రామానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. విశాఖ సైనికాధికారి కల్ పాండే, కాకినాడ సైనిక సంక్షేమ అధికారి ఎం.కృష్ణారావు, భానుప్రసాద్, విశాఖ నేవీ అధికారి ఎంసీపీవో అభిలాష్, ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ సుబేదార్ చంద్రశేఖర్, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, బాడంగి ఎస్ఐ జయంతి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, తహసీల్దారు రాజారావు, మండల టీడీపీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, బొబ్బిలికి చెందిన మాజీ సైనికోద్యోగుల సంఘ నాయకులు రేవెళ్ల కిరణ్ కుమార్, రెడ్డి దామోదరరావు తదితరులు నివాళులు అర్పించారు. వర్షాన్ని లెక్క చేయకుండా మాజీ ఆర్మీ ఉద్యోగులంతా బొబ్బిలి నుంచి బైకులపై ర్యాలీగా బొత్సవానివలస గ్రామానికి చేరుకున్నారు. శంకర్‌కు తల్లిదండ్రులతో పాటు భార్య కోమలత, పిల్లలు దివ్యాన్షిక(9), జయంత్‌నాయుడు (7) ఉన్నారు. శంకరరావు ఉదంతాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే బేబీనాయన చెప్పారు. అతని భార్య కోమలతకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

భూములను సాగుదారులకే అప్పగించాలి



పాతబొబ్బిలిలో దేవదాయ భూములను పరిశీలిస్తున్న దృశ్యం

బొబ్బిలి: దేవదాయ శాఖకు చెందిన భూములను పూర్వకాలం నుంచి సాగు చేసుకుంటున్న రైతులకే అప్పగించాలని జిల్లా కౌలు రైతు సంఘ కార్యదర్శి రాకోటి రాములు, అధ్యక్షుడు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. పాతబొబ్బిలి, గొల్లపల్లి గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న దేవాదాయ భూములను శనివారం వారు పరిశీలించారు. దేవదాయ శాఖ భూములపై సాగు చేసుకుంటున్న రైతుల కుటుంబాలకే హక్కు కల్పించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అయినప్పటికీ అధికారులు ఇందుకు విరుద్ధంగా బహిరంగ వేలం నిర్వహించి ఎక్కువ కౌలు చెల్లిస్తున్న వారికి సాగుహక్కులు కల్పించడం అన్యాయమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట



మాట్లాడుతున్న జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ

బొబ్బిలి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరుబాటలోనే సీపీఐ ఉంటుందని జిల్లా సీపీఐ కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో శనివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి తన బలాన్ని పుంజుకున్నట్లుగా నిరూపించుకుందన్నారు. దేశసంపదను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా కట్టబెడుతూ దేశంలో మతోన్మాద శక్తులకు అండగా మోదీ పాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, ఏరియా కార్యదర్శి కండాపు ప్రసాదరావు, నాయకులు కోట అప్పన్న, నాగభూషణ్, మునకాల శ్రీనివాసరావు, తాడంగి ఎండుదొర, హమాలీస్ జిల్లా అధ్యక్షుడు ముల్లు నర్సింహులు, గోపి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మా భూములు ఇప్పించండి

● ఎమ్మెల్సీ రఘురాజుకు జిందాల్ నిర్వాసితుల వినతి



రఘురాజుకు వినతిపత్రం ఇస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట రూరల్: గడిచిన 15ఏళ్లగా తాము జిందాల్‌కు ఇచ్చిన భూముల్లో పరిశ్రమ వస్తుందని.. తమ పిల్లల జీవితాలు బాగుపడతాయని ఎంతో ఎదురు చూస్తే... నిరాశే మిగిలిందని.. కొన్ని విషయాల్లో తమను కంపెనీ యాజమాన్యం మోసం చేసిందని నిర్వాసితులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వద్ద ఆరోపించారు. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. శనివారం ఉదయం బొడ్డవరకు వెళ్లిన నిర్వాసితులు ఎమ్మెల్సీ రఘురాజును కలిశారు. వారు మాట్లాడుతూ 2008లో నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి మాటలు నమ్మి ఘోరంగా నష్టపోయామన్నారు. డీపట్టా భూములకు కేవలం రూ.రెండు లక్షల నగదు, రూ.రెండు లక్షల షేర్ ధనం, జిరాయితీ భూములకు రూ.6లక్షల నగదు, రూ.6లక్షల షేర్ ధనం ఇస్తామంటే ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారని.. భూములు ఇచ్చిన రైతులకు ఒక్కమాట కూడా చెప్పకపోవడం బాధ కలిగించిందని చెప్పారు. దీనిపై రఘురాజు స్పందిస్తూ ఈ విషయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వివరించామని చెప్పారు. ప్రభుత్వం, సంస్థ ప్రతినిధులు, నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరామన్నారు. నిర్వాసితుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టిలో పెడతామని చెప్పారు.

మాతృసంస్థకు పంపించాలని బిల్లు కలెక్టర్ల వినతి



ఎమ్మెల్యే బేబీనాయనకు వినతిపత్రం అందజేస్తున్న బిల్లు కలెక్టర్లు

బొబ్బిలి: సచివాలయ వ్యవస్థ నుంచి తామందరినీ మాతృసంస్థలకు తిరిగి పంపించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ బిల్లు కలెక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు జీఎం ఖాన్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు శనివారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీ నాయనను కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులతో పాటు వర్క్ ఇన్‌స్పెక్టర్లు, చైన్‌మ్యాన్లు తదితరులను రాష్ట్రవ్యాప్తంగా సుమారు పది వేల మందిని గత ప్రభుత్వం వార్డు కార్యదర్శులుగా నియమించిందన్నారు. దీనితో తమ పదోన్నతులకు సంబంధించి అనేక సమస్యలు తలెత్తి ఎంతో నష్టం జరిగిందన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్వీసు రూల్స్ నుంచి తమకు విముక్తి కలిగించి అందరినీ మాతృసంస్థలకు తిరిగి పంపించాలని ఖాన్ కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని బేబీనాయన వారికి హామీ ఇచ్చారు.

చంద్రబాబుతోనే బీసీలకు ఆదరణ

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

విజయనగరం: చంద్రబాబుతోనే బీసీలకు సాధికారత, ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్సీ, టిడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు అన్నారు. ఉత్తరాంధ్ర బీసీ, వెనుకబడిన కులాలు, రజక సంఘాల ఆధ్వర్యంలో శనివారం జడ్పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సుమారు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందే తప్ప, ఎవరికీ న్యాయం చేయ్యలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలు, అనుబంధ కులాలకు ఉపయోగపడే వస్తువులను, సబ్సీడీపై ఆదరణ పథకం ద్వారా అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. వైసీపీ వచ్చిన తరువాత ఆదరణ పథకం జాడ లేదన్నారు. రానున్న రోజుల్లో రూ.50 కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ కోసం నిధులు కేటాయించనున్నట్లు రామారావు తెలిపారు. ముందుగా బీసీ సంఘాలు ఆయనను ఘనంగా సన్మానించాయి. రాష్ట్ర రజక సంఘ అధ్యక్షురాలు ఎలిగాపు విజయలక్ష్మి, ప్రతినిధులు కేశవపట్టణం చంద్రిక, చిలకపల్లి శ్రీనివాసరావు, గణపతి తదితరులున్నారు.

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

● ప్రతులను దహనం చేసిన యూటీఎఫ్



విజయనగరంలో..



బొబ్బిలిలో..

విజయనగరం దాసన్నపేట, జూలై 13: రాష్ట్రంలో గత ప్రభుత్వం సీపీఎస్ స్థానంలో తీసుకువచ్చిన జీపీఎస్ గజిట్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌చంద్రపట్నాయక్, ఈశ్వరరావులు డిమాండ్ చేశారు. శనివారం జీఓ నెంబరు 57ని రద్దు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసి, గజిట్ కాపీలను మంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం జీఓ నెం 54ను తీసుకువచ్చి, జీపీఎస్‌ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సేవలకు గుర్తించినా, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో యుటీఎఫ్ నాయకులు రాము, శ్రీనివాసరావు, ప్రసాదరావు, తిరుపతినాయుడు, సత్యానారాయణ, రాజారావు, రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సీపీఎస్ ఉద్యోగులకు జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక గాంధీవిగ్రహం ముందు గెజిట్ ప్రతులన దహనం చేశారు. ఆ సంఘం రాష్ట్రనేత కె.విజయగౌరి మాట్లాడుతూ జీపీఎస్ అమలు కోసం గజిట్ పబ్లికేషన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ముమ్మాటికీ ఉద్యోగులను మోసగించడమేనన్నారు. ఈ రాజపత్రాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, సుధాకర్, మహేశ్, వరప్రసాద్, స్వామినాయుడు ఉన్నారు.

ఇదేనా 'ఆదర్శం'?

- మరుపల్లి ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కరువు
- నాడు-నేడు పనుల్లో నాణ్యతా లోపం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలోగల ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పాఠశాల ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా మౌలిక వసతులపై అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో నాడు-నేడు కింద సుమారు రూ.43లక్షల నిధులు మంజూరు చేశారు. అయితే నేటికీ పాఠశాలలో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, క్రీడా మైదానం తదితర వసతులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యా కమిటీ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో పనులు చేపట్టినా పనుల్లో నాణ్యత లోపించడంతో మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వినియోగించలేని విధంగా ఉండడంతో విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో వరకు 425 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అలాగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 70 మంది వరకు ఉన్నారు. ఇంతమంది విద్యార్థులకు మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులకు గురి కావల్సి వస్తోంది. అలాగే పాఠశాలకు వెళ్లే రోడ్డు లేకపోవడం, క్రీడా మైదానం మెరుగు పర్చకపోవడంపై తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ట్యాప్‌లు, కింద నీరు చేరిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం

క్రీడా మైదానం మెరుగు పర్చడంతో పాటు మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటాం. పాఠశాలకు వచ్చే రోడ్డు విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం.

- గెద్ద ఈశ్వరరావు, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, మరుపల్లి

సమస్యలపై వినతి

- ఎమ్మెల్యే కళాను కలిసిన సంక్షేమ సహాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంక్షేమ సహాయకులు

చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సేవలందిస్తున్న సంక్షేమ సహాయకులు శనివారం స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావును కలిశారు. రాజాంలో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన వారు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న 11 శాఖలకు పదోన్నతి సర్వీసు రూల్సు పొందుపరిచినప్పటికీ, తమకు మాత్రం ఎటువంటి పదోన్నతి సర్వీసు రూల్స్ లేవన్నారు. తామంతా సాంఘిక సంక్షేమ శాఖలో ఉన్నప్పటికీ, దాదాపు పది శాఖలకు చెందిన సంక్షేమ పథకాలను తమ ద్వారా అమలవుతున్నాయని వారు తమ వినతిపత్రంలో వివరించారు. డిగ్రీ అర్హతతో తమను నియమించనప్పటికీ, తమలో చాలా మంది పీజీలు పూర్తి చేసినవారున్నారని వారు తెలిపారు. గత ఐదేళ్లుగా పని చేస్తున్న తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

పీఆర్టీయూ దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

చీపురుపల్లి: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వానికి విజయనగరం జిల్లా తరపున వినతి పత్రం అందజేశామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు తెలిపారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సమస్యలు వివరించినట్టు స్థానిక విలేకర్లకు చెప్పారు. వీటితో పాటు జిల్లాలో ఉన్న సమస్యలు కూడా తెలియజేశానని తెలిపారు.

రాజాంలో 'స్టాప్ డయేరియా'



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని గాయత్రీ కాలనీ టానా వీధిలో శనివారం స్టాప్ డయేరియా కార్యక్రమం చేపట్టారు. పురపాలక సంఘం అధికారులు, వైద్యాధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జె.రామప్పలనాయుడు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజూ వేడినీటిని తాగాలని, డయేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనిలో భాగంగా ప్రతిరోజూ పురపాలక సంఘం పరిధిలోని నాలుగు సచివాలయాల్లోను స్టాప్ డయేరియా కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీవో నూకరాజు ఏఈ భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్, ఏఎన్ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాస పెంపకంపై దృష్టి సారించాలి



పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

భోగాపురం: పశుగ్రాస పెంపకంపై రైతులు దృష్టి సారించాలని పశు వైద్యాధికారులు యు.రామరాజు, కమలకుమారి అన్నారు. మండలంలోని ముంజేరు, పోలిపల్లి పరిధిలో శనివారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు పశుగ్రాస పెంపకం ప్రాముఖ్యత, పాడి పశువులను మేపడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా బృందం



ఎంపికైన క్రీడాకారులు

బొబ్బిలి: వచ్చే నెల 19 నుంచి మూడు రోజుల పాటు చిత్తూరు జిల్లా పుత్తూరులో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో జిల్లా తరపున పోటీ చేయబోయే జట్టును ఎంపిక చేశారు. పారాది జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, ఉపాధ్యక్షులు ఇనుగంటి విజయ్ కుమార్, సుంకరి సాయిరమేష్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 150 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. బాడంగి, అరికతోట హైస్కూళ్ల పీడీలు బంగారునాయుడు, సత్యనారాయణ, పీడీ వెంకట నాయుడు పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ముప్పాల హరి, తెర్లి రామ్మోహన్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించండి

బొబ్బిలి: దయనీయంగా జీవితాలను గడుపుతున్న నాయీబ్రాహ్మణులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావును కోరినట్లు విజయనగరం పార్లమెంట్ తెలుగుదేశం సాధికార సమితి సభ్యుడు చిలకలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం రాత్రి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు వచ్చిన దువ్వారపును కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. తమ సమస్యలను సీఎం చంద్రబాబుకు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని రామారావు హామీ ఇచ్చినట్లు చిలకలపల్లి తెలిపారు.

మొక్కులు చెల్లించుకున్న జనసైనికులు

వేపాడ: ఇటీవల ఎన్నికల్లో పిఠాపురం ఎమ్మెల్యేగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విజయం సాధించడంతో పాటు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో వల్లంపూడి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు శానాపతి నాయుడు, పైడినాయుడుల ఆధ్వర్యం లో స్థానిక రామాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకే ఇవ్వాలి

సాలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం వర్తించేలా నిబంధన విధించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో వేలాది, లక్షలాది రూపాయలను వెచ్చించి చదివించే విద్యార్థులకు ఈ పథకం వర్తింపజేయవద్దని తెలిపారు. జీవో-117 రద్దుచేయాలని, జీవో -3ను పునరుద్ధరించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. పీఆర్సీ వెంటనే ప్రకటించాలని తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పాత బకాయిలను విడుదల చేయాలన్నారు.

నేడు విద్యా సదస్సు

గరుగుబిల్లి: పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ గరుగుబిల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.సన్యాసిరావు, ఎ.ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు గౌరవార్థం జరిగే కార్యక్రమంలో కళా ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణారావు నిర్వహణలో జరిగే కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు మహేష్ హాజరు కానున్నారని తెలిపారు.

పేదల పక్షపాతి చంద్రబాబు

- రాజాం ఎమ్మెల్యే కోండ్రు

రాజాం: పేదల పక్షపాతి నారా చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక మాధవ బజార్‌లోగల మూర్తి ఎంపోరియం వద్ద ఏర్పాటు చేసిన నిత్యావసరాల విక్రయ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. స్టాల్ వద్ద కందిపప్పు, బియ్యం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలను నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన కిరాణా సామగ్రిని రాయితీపై సరఫరా చేసేందుకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం ధరలను తగ్గించి విక్రయించాలని నిర్ణయించిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.181 ఉంటే రూ.155కు, బియ్యం రూ.52.40 ఉంటే రూ.48కి, స్టీమ్డ్ బియ్యం రూ55.85 ఉంటే రూ.49కి విక్రయిస్తారని వివరించారు. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఫుడ్ మాఫియాని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని హెచ్చరించారు. జగన్‌రెడ్డి ఆహార భద్రత కల్పించే పౌర సరఫరాల శాఖను అప్పులపాలు చేశారని, రైతులను ఆదుకోవాల్సింది పోయి బకాయిలు వదిలేసి వెళ్లి పోయారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, టంకాల కన్నంనాయుడు, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, దప్పులపూడి శ్రీనివాసరావు, నాగరాజు, కమిషనర్ జె.రామప్పలనాయుడు, తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, సీఎస్‌డీటీ చిరంజీవి, ఉరిటి సురేంద్ర, మగడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బియ్యం, కందిపప్పు పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రహదారిపైనే పశువుల సంచారం



రాత్రి సమయంలో రాజాం మెయిన్ రోడ్డులో సంచరిస్తున్న పశువులు

రాజాం రూరల్: రాత్రి తొమ్మిది గంటలు దాటిందంటే చాలు.. ఇక్కడి మెయిన్ రోడ్డులో పశువుల సంచారం పెరిగిపోతోంది. పదుల సంఖ్యలో మెయిన్‌రోడ్డుపై చేరి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన పశువుల యజమానులు వీటిని రాత్రివేళ విడిచిపెడుతుండడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డుపైనే సంచరిస్తూ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. డివైడర్లపై సేదతీరుతూ కొన్ని పశువులు ఉన్నఫలంగా రోడ్డుపైకి వస్తుండడంతో ద్విచక్ర వాహనచోదకులు బోల్తాపడే ఘటనలు ఉన్నాయి. పశువుల యజమానుల్ని హెచ్చరించాల్సిన మున్సిపల్ యంత్రాంగం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. రోడ్డుపై ప్రమాదాలకు కారణమవుతున్న పశువుల్ని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

75శాతం రాయితీపై విత్తనాలు

భోగాపురం: రైతులకు 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు అందజేస్తున్నామని పశు వైద్య శాఖ ఏడీ ఉమాశంకర్ మహాపాత్రో తెలిపారు. భోగాపురం ఏరియా పశు వైద్య శాలలో శనివారం రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాస విత్తనాలు పశువులకు చాలా ఉపయోగకరమన్నారు. జొన్న రకానికి చెందిన పశుగ్రాస విత్తనాలు 75శాతం రాయితీపై అందిస్తున్నామని చెప్పారు. ఐదు కిలోల సంచి ధర రూ.460 కాగా, రైతు చెల్లించవలసింది రూ.115 మాత్రమే అన్నారు. వీటిలో పాటు చిక్కుడు జాతులు పశుగ్రాసం, కొత్తరకం పసుగ్రాసం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చాందిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి



మొక్క నాటుతున్న డీఎస్పీ

రాజాం రూరల్: ప్రతి వ్యక్తి తన పుట్టినరోజు, పెళ్లి రోజు.. ఇలా ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించు కుని కనీసం ఒక మొక్క నాటి, దానిని సంరక్షించాలని చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస చక్రవర్తి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వికాశ తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి, రాజాం టౌన్ సీఐ మోహనరావు, రాజాం మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు, మహంతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో వన మహోత్సవం

రాజాం / రూరల్: సంతకవిటి మండలం సిరిపురం గ్రామంలో శనివారం వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని స్వర్గధామంతో పాటు ప్రభుత్వ పాఠశాల, తామర చెరువు గట్టుపై మొక్కలు నాటారు. అభ్యుదయ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొయ్యి నారాయణప్పడు, అక్కులపోతు శ్రీరాములు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన బూరాడ శ్రీనివాసరావు అటవీ శాఖ సౌజన్యంతో మొక్కల్ని సరఫరా చేశారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

స్వచ్ఛందంగా..

- రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు



ఇసుక మేటలను తొలగిస్తున్న నగేష్

రాజాం/ రూరల్: రాజాం మండల పరిధిలోని అంతకాపల్లి సమీప సారధి గెడ్డపై ఉన్న వంతెన పరిసరాల్లో ఇసుక మేటలు వేసి, వర్షపు నీరు చేరిపోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇక్కడ ప్రమాదాల నివారణకు శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం మద్రివలస గ్రామానికి చెందిన పలిశెట్టి నగేష్ అనే వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు. ఇద్దరు కూలీలతో కలిసి గత రెండు రోజులుగా ఇక్కడ రెయిలింగ్‌పై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. రోడ్డుపై ఉన్న ఇసుక మేటలను తొలగించి, వర్షపునీరు వంతెన పైభాగంలో నిలిచిపోకుండా గెడ్డలోకి వెళ్లేలా చిన్నపాటి మార్గాన్ని ఏర్పాటు చేశారు.


నూతన విధానంతో విద్యారంగం నాశనం

- ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల్లో నాయకుల ధ్వజం

బొబ్బిలి: దేశంలో విద్యారంగాన్ని నాశనం చేసే నూతన విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. స్థానికంగా శనివారం ఎస్ఎఫ్ఐ ప్లీనరీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు డి.రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వం దుందుడుకు చర్యలకు ఈ ప్రభుత్వం స్వస్తి పలకాలన్నారు. విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో ఆర్ట్స్ గ్రూపుల రద్దు యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో నాయకులు రవికుమార్, మణికుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లపై చర్య తీసుకోండి

- పార్వతీపురం పట్టణ సీపీఎం కమిటీ సభ్యులు



బిల్లబందను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలో అనధికార లేఅవుట్లపై చర్యలు తీసుకో వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జీవీరమణ, కమిటీ సభ్యులు పి.సన్యాసిరావు కోరారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అనధికార లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మునిసిపాలిటీ పరిధిలోని బిళ్ల బందను కప్పి లేఅవుట్ వేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారులకు బందల ఆక్రమణలపై హెచ్చరికలు జారీచేసినా పట్టించుకోవడం లేదన్నారు. బిల్లబంద, గోపసాగరం పరిధిలో ప్రభుత్వ భూమిని పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ శాఖలు స్వాధీనం చేసుకోక పోతే త్వరలో ఉద్యమ ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రతి సోమవారం
ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.శ్వేత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేదిక ద్వారా ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేయవచ్చునని ఆమె తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

క్లుప్తంగా..

వంగరలో భారీ వర్షం



అరసాడ వీధుల్లో నిలిచిన వర్షపునీరు

వంగర: మండలంలోని అరసాడ, వంగర, సీతారాంపురం తదితర గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గరివిడి: మండల పరిషత్ ప్రధాన రహదారి ఆవరణలో శనివారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి, వాహనాలు నడపరావని సూచించారు.

తెలుగు మహిళా అధ్యక్షురాలిని సస్పెండ్ చేస్తూ తీర్మానం

గంట్యాడ: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన పెంటశ్రీరాంపురం గ్రామానికి చెందిన తెలుగు మహిళా అధ్యక్షు రాలు, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్‌పర్సన్ గుల్లుపల్లి లలితను సస్పెండ్ చేస్తూ టీడీపీ మండల శాఖ తీర్మానం చేసింది. శనివారం గంట్యా డలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ తీర్మానం చేశారు. ఇటీవల గ్రామ స్థాయిలో లలితను సస్పెండ్ చేస్తూ తీర్మానం చేసి పంపించడంతో, దీనిని మండల స్థాయిలో ఆమోదించి, పార్టీ జిల్లా శాఖకు పంపించామని భాస్కర్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక కేజీబీవీలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన సమయాన్ని వృథా చేయవద్దని, పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు.